ఈరోజు (30 జూన్) పెట్రోలు, డీజిల్ ధరల పెంపుకు నిరసనగా సిపిఐ(యం) రాష్ట్ర కార్యాలయంలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమం వివరాలు ప్రచురణార్థం/ ప్రసారార్థం పంపుతున్నాము. – జె.ప్రభాకర్, ఆఫీసు కార్యదర్శి

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రో, డీజిల్ ధరలు తగ్గించాలి
### – వెనక్కి తగ్గకుంటే రాష్ట్ర బంద్
### – వామపక్షాల ధర్నాలో మధు, రామకృష్ణ

22 రోజులుగా వరుసగా పెంచుకుంటూ వస్తున్న పెట్రోల్, డీజిల్ ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగ్గించాలని, లేకుంటే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని వామపక్షాలు హెచ్చరించాయి. పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా సిపిఎం రాష్ట్రకార్యాలయంలో వామపక్షాలు మంగళవారం ధర్నా నిర్వహించాయి. పెట్రోల్, డీజిల్‌పై ధరలు పెంచుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలు నశించాలని నినదించాయి. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్రకార్యదర్శి పి మధు మాట్లాడుతూ కరోనా వల్ల ప్రజల ఆదాయాలు దెబ్బతిన్న నేపథ్యంలో వారిని ఆర్థికంగా ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం, వారిపై పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ఆర్థిక భారాన్ని మోపిందని విమర్శించారు. లీటరు పెట్రోల్‌పై రూ.10, డీజిల్‌పై ఏకంగా రూ.13 పెంచిందన్నారు. 2018 అక్టోబర్‌లో బ్యారెల్ చమురు ధర 80డాలర్లుగా ఉందని, నేడు 35 డాలర్లకు తగ్గిందని తెలిపారు. ఈ క్రమంలో పెట్రోల్, డీజిల్ ధరలు గణనీయంగా తగ్గాల్సింది పోయి పెంచడమంటే ప్రజలపై కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా మోపుతున్న భారాలు స్పష్టమవుతున్నాయని అన్నారు. వాస్తవంగా పెట్రోల్, డీజిల్ బేస్ ధర రూ.26 అయితే విజయవాడ నగరంలో లీటరు పెట్రోల్ రూ.83.45 అమ్ముతున్నారని, బేస్ ధరకు, పన్నులతో కూడిన ధరలకు ఏమాత్రం పొంతన లేదని అభిప్రాయపడ్డారు. కేంద్రం ఎక్సైజ్ డ్యూటి, రోడ్డు సెస్‌లను పెంచి అడ్డగోలుగా ఖజానా నింపుకోవాలని చూడడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం పెంచితే మేమెందుకు ఊరికే ఉండాలనే ఉద్దేశంతో వ్యాట్, తదితర సుంకాలను కొన్ని రాష్ట్రాలు పెంచాయని, ఇవన్నీ పెరగడంతో ప్రజలపై భారాలు తడిసి మోపెడవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్‌పై పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని వామపక్షాలుగా డిమాండ్ చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీ, రోడ్డు సెస్‌లను తగ్గించాలని, రాష్ట్ర ప్రభుత్వం వ్యాట్ తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ధర్నాలు నేడు జరుగుతున్నాయని అన్నారు. రోడ్డు సెస్‌లు ఇప్పటికే చాలా వసూలు చేస్తున్నారని, దీనికి తోడు టోల్‌గేట్ల ద్వారా ప్రజలను దోచుకుతింటున్నారని, టోల్‌గేటు గడువు తీరిపోయాక కూడా వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వైఖరిని మార్చుకోకుంటే వామపక్షాలుగా భవిష్యత్తులో ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామని హెచ్చరించారు. కార్యాచరణ ఏవిధంగానైనా ఉండొచ్చని, అది బంద్ జరగొచ్చు లేదంటే మరేదైనా జరగొచ్చు అని తెలిపారు.

### విశాఖ గ్యాస్ ప్రమాదం బాధాకరం

ఎల్జీ పాలిమర్స్ కంపెనీలో ఇటీవలె చోటుచేసుకున్న గ్యాస్ లీకేజీ ఘటనను మరువక ముందే విశాఖ సమీపంలోని పరవాడలో సాయినార్ లైఫ్ సైన్సెస్ ఫార్మా కంపెనీలో గ్యాస్ లీకేజీతో సోమవారం ఇద్దరు మరణించడం బాధాకరమన్నారు. ఇటువంటి గ్యాస్ కంపెనీల్లో ప్రతి సంవత్సరం ఇదేవిధంగా కార్మికులు చనిపోతున్నారని, విశాఖ ప్రజలు భయం గుప్పిట్లో బ్రతుకుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన కొన్ని సవరణల్లో పారిశ్రామిక భద్రతకు సంబంధించిన సవరణ ఉందని, దీన్ని అమలు జరిపిన రాష్ట్రాలకే రుణ సదుపాయాన్ని 3.5శాతం నుండి 5శాతానికి పెంచుకునే వీలు కేంద్ర కల్పించిందని తెలిపారు. దీనిని అడ్డుపెట్టుకుని బలవంతంగా రాష్ట్రాలతో కేంద్రం ఇటువంటి కంపెనీలను పెట్టించి, ప్రజల ప్రాణాలను బలిగొంటుందని విమర్శించారు. అదేవిధంగా రైతులపై మూడు ఆర్డినెన్సులు, విద్యుత్ సవరణ చట్టం, కార్మికుల రక్షణ చట్టాలను నీరుగార్చే సవరణలతో ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారాలు మోపుతోందన్నారు. 14కోట్ల అసంఘటిత రంగం కార్మికులు ఎన్ని అవస్థలు పడ్డారో ప్రజలు చూస్తున్నారని, ఇవన్నీ రానున్న రోజుల్లో పెద్ద పెద్ద పోరాటాలకు దారితీస్తాయని తెలిపారు. కేంద్రం దివాళాకోరు ఆర్థిక విధానాలతో ప్రజలను దోచుకుతింటోందని, వామపక్షాలు వీటిని ఎదుర్కొంటాయని అన్నారు. ఇతర రాజకీయ పక్షాలు కూడా ఈ పరిణామాలను గమనించి వామపక్షాల ఉద్యమాలకు మద్దతునివ్వాలని కోరారు.

సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ కరోనాతో ప్రజలు తల్లడిల్లిపోతున్న తరుణంలో రికార్డు స్థాయిలో 22 రోజులు వరుసగా పెట్రోల్, డీజిల్‌పై రేట్లు పెంచి ప్రజలపై కేంద్ర ప్రభుత్వం భారాలు మోపిందని అన్నారు. గతంలో ఎన్నడూ ఈ విధంగా ధరలు పెరగలేదని తెలిపారు. ముడి చమురు ధరలు తగ్గుతుంటే, దేశంలో రేట్లు పెరగడం కేంద్ర ప్రభుత్వ దుర్మార్గాలకు నిలువుటద్దం అన్నారు. ఆశ్చర్యకరంగా డీజిల్ ధర పెట్రోల్ ధరను అధిగమించిందని తెలిపారు. దీంతో దేశ ప్రజలపై రూ.1.50లక్షల కోట్ల 22 రోజుల్లో కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మోపిందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా వ్యాట్, కరెంటు, కందిపప్పు, పంచదార ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ధరలు తగ్గించేవరకు వామపక్షాలుగా పోరాటాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. విశాఖ పరవాడలోని ఫార్మా కంపెనీలో గ్యాస్ లీకేజీతో సోమవారం ఇద్దరు చనిపోయారని మరో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉందన్నారు. నంద్యాల గ్యాస్ లీకేజీ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని గ్యాస్ నిల్వల ఫ్యాక్టరీల రక్షణ చర్యలపై ప్రభుత్వం విచారణ జరపాలని కోరారు. చనిపోయిన తర్వాత నష్టపరిహారం ఇవ్వడం కాకుండా, ప్రాణాలు పోకుండా కాపాడే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో పొల్యూషన్ డిపార్ట్‌మెంట్ లంచాలకు అలవాటు పడి, రక్షణ చర్యలు తీసుకోకుండా నిద్రపోతోందని విమర్శించారు. చనిపోయిన వలస కార్మికులకు కూడా నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సిహెచ్ బాబూరావు, వి ఉమామహేశ్వరరావు, డి రమాదేవి, సిపిఐ నాయకులు జల్లి విల్సన్, సిపిఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు పోలారి, ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు సుందరరామరాజు, ఎంసిపిఐ యు నేత ఖాదర్‌బాషా, విద్యార్థి, యువజన, కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

= = = =